తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాదాద్రి భువనగిరి
బుధవారం
14 జనవరి 2026
పేజీలు : 8


Follow :

# పెట్రోల్ బంక్ యాజమాన్యాల నిర్లక్ష్యం

## పనిచేయని గాలిపంపులతో వాహనదారుల అవస్థలు



**భూదాన్ పోచంపల్లి (జనంసాక్షి):**
భూదాన్ పోచంపల్లి మండలంలో పలు పెట్రోల్ బంక్‌లలో వాహనదారులకు తప్పనిసరిగా అందించాల్సిన ఉచిత టైర్ గాలిపంపులు పనిచేయకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. బంక్ యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు రోజూ అనవసర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పెట్రోల్ బంక్‌లలో గాలిపంపులు పూర్తిగా పనిచేయకపోయినా, మరికొన్ని చోట్ల పనిచేయడం లేదు అంటూ సిబ్బంది చేతులెత్తేస్తూ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారు. నియమాల ప్రకారం ప్రతి పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు ఉచిత గాలిపంపు సౌకర్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ, ఆ నిబంధనలను బంక్ యాజమాన్యాలు లెక్కచేయకపోవడం ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. గాలి కోసం బయట ప్రైవేట్ పంక్చర్ షాపులకు వెళ్లాల్సి రావడంతో వాహనదారులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పెట్రోల్ బంక్‌లపై కఠిన తనిఖీలు నిర్వహించి, పనిచేయని గాలిపంపులను తక్షణమే సరిచేయించడంతో పాటు నిర్లక్ష్యం వహించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



నిబంధనలు పాటించని పెట్రోల్ బంక్ లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. పెట్రోల్ కొట్టించుకునేటప్పుడు అన్ని సౌకర్యాలు ఉంటాయని భావిస్తాం. ఇది బంక్ యాజమాన్యాల నిర్లక్ష్యమే గాలిపంపులు పనిచేయవని ముందే తెలిసినా, వాటిని సరిచేయకపోవడం దురదృష్టకరం. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి.

**బీజేపీ మండల అధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి**



గాలిపంపు పని చేయడం లేదు అని చెప్పి సిబ్బంది బాధ్యత నుంచి తప్పించు కోవడం సరికాదు. వెంటనే గాలిపంపు లను బాగు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా కఠిన జరిమానాలు విధించాలి.

**పి వై ఎల్ యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి పగడాల శివ**



భూదాన్ పోచంపల్లి లోని పెట్రోల్ బంక్ లలో వాహనదారులకు తప్పనిసరిగా ఉండాల్సిన త్రాగునీరు, టాయిలెట్స్, గాలిపంపు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ సదుపాయాలు వాహనదారులకు అందించాల్సిందే. లేకపోతే సంబంధిత అధికారుల ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

**సిరిపంగి మహేష్ జిల్లా కన్వీనర్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక**

ఉచితంగా ఇవ్వాల్సిన సౌకర్యానికి డబ్బులు ఖర్చు చేయాల్సి రావడం అన్యాయం. రోజూ ప్రయాణించే సామాన్యులపై అదనపు భారం పడుతోంది.

**దేవరకొండ విగ్నేశ్వర్ ,వాహనదారుడు**

ప్రజలందరికీ సంక్రాంతి పండుగ

# శుభాకాంక్షలు

## మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
మకరరాశిలోకి సూర్యుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే మకర సంక్రాంతి ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండి సుఖశాంతులతో జీవించాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆకాంక్షిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయన భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ఈ పండగలను జరుపుకోవాలన్నారు. ప్రధానంగా ఈ పండగ సందర్భంగా భోగి మంటలు, పతంగులు ఎగురవేసే ప్రతి ఒకరు జాగ్రత్తలు, నిబంధనలు పాటించాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



**చౌటుప్పల్, జనవరి 13 (జనం సాక్షి)**
సంక్రాంతి పండుగ వేళ ప్రజల రక్షణ కోసం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. గస్తీ నిర్వహిస్తుండగా అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో

మిగతా 2లో

# అరైవ్ - ఎలైవ్ నిరంతర రోడ్డు భద్రత ఉద్యమం : ఎస్పీ కె.నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
రోడ్డు ప్రమాదాల రహిత సూర్యాపేట జిల్లా కోసం పౌరులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. అరైవ్ - ఎలైవ్ సురక్షిత గమ్యం - సజీవ ప్రయాణం అనేది కేవలం ఒక్క రోజు కార్యక్రమం కాదని, నిరంతర సామాజిక ఉద్యమమని తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కిరాణ ఫ్యాన్సీ అండ్ మర్చంట్ అసోసియేషన్ హాల్ నందు నిర్వహించిన రోడ్డు భద్రతా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అరైవ్ - ఎలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి పౌరుడు, ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పౌరులు బాధ్యతగా ఉండటం, ప్రయాణ సమయంలో సురక్షిత గమ్యాలను

మిగతా 2లో

# జాన్ పహాడ్ ఉర్సుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్



**పాలక వీడు (జనంసాక్షి):**
ఈనెల 22,23,24 న నిర్వహించే హజ్రత్ జాన్ పాక్ షహీద్ దర్గా ఉర్సు కు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. పాలక వీడు మండలంలో జానపాడు లో జరిగే ఉర్సు ముందస్తు ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో మంగళవారం జానపాడు లోని జే పి ఎస్ పంక్షన్ హాల్ లో కలెక్టర్ సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ శూన్యపహాడ్ నుండి జానపాడు దర్గా వరకు రోడ్డు గుంటలతో ఉందని ఉత్సవాల్లోపు మరమ్మత్తులు చేపట్టాలని,గొల్లభామ గుట్ట వద్ద లైటింగ్ అలాగే దర్గా పరిసర ప్రాంతాలలో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా సంబంధిత అధికారులను కలెక్టర్ వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే ఉర్సుకు లక్షలలో భక్తులు వస్తారు కాబట్టి తగ్గిన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు కనబడే విధంగా ధరల పట్టికను అన్నిచోట్ల ప్రదర్శించాలని

మిగతా 2లో

# అరైవ్ - ఎలైవ్ నిరంతర రోడ్డు భద్రత ఉద్యమం

## ఎస్పీ కె.నరసింహ

చేరుకోవడం లక్ష్యంగా తెలంగాణ డిజిపి ఆధ్వర్యంలో అరైవ్ – ఎలైవ్ అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కాలనీలో, ప్రతి మండలంలో పోలీసులు పౌరుల భాగస్వామ్యంతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రత పట్ల పౌరులకు విస్తృత అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేస్తామని అన్నారు.డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నూటికి నూరు శాతం అరికట్టవచ్చని అన్నారు.వాహన చోదకుల నిర్లక్ష్యమే ప్రాణాంతకమవుతోందని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు మాత్రమే కాకుండా, వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కఠిన జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ ధరించాలని, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్ మృత్యువుకు ఆహ్వానం పలకడమేనని అన్నారు. మద్యం సేవించి వాహనం నడిపే వారి పట్ల రాజీ లేని కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.రహదారి నియమాలు పాటించి ఇతరులకు ఆదర్శంగా నిలిచే పౌరులను రహవీర్ రహదారి హీరో అని ఆయన అభివర్ణించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు బాధ్యతగా మెలగాలని కోరారు.అనంతరం రోడ్డు భద్రత పట్ల ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, పౌరులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రసన్న కుమార్, ఇంచార్జీ ఆర్టీవో జయప్రకాష్ రెడ్డి, పట్టణ సీఐ వెంకటయ్య, ఆర్టిసి డిఎం సునీత, జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ గీతావాణి, ఆర్ఐఓ ప్రశాంతి, ఎస్ఐలు సాయిరాం, ఏడుకొండలు, మహేందర్, ఐలయ్య, వెంకన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాన్ పహాడ్ ఉర్సుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

వక్ఫ్ బోర్డ్ అధికారులను ఆదేశించారు.జానపాడు దర్గా పరిసర ప్రాంతాలలో రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు తొలగించాలని, రోడ్లు ఎక్కడైనా గుంటలు ఏర్పడితే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, అవసరం ఉన్న చోట అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, తాగునీరు వసతి ఏర్పాటు చేయాలని,అగ్నిమాపక అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని విద్యుత్తులో అంతరాయం లేకుండా సరఫరా చేయాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని,ముఖ్యమైన ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పోలీస్ శాఖ భక్తులకి ఎలాంటి ఇబ్బంది కల్గకుండా వాహనాలను పార్కింగ్ చేపించాలని,ట్రాఫిక్ ను, భక్తులను నియంత్రించేందుకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి,ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు అనూష,రవితేజ, తహసీల్దార్ కమలాకర్ ఎంపీడీవో లక్ష్మి,మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కోల నరేష్ కుమార్, భరద్వాజ్ సోమవారం రాత్రి క్రైమ్ బీసీ డ్యూటీలో భాగంగా పెట్రోలింగ్ కి వెళ్లారు. పండుగ రద్దీ నేపథ్యంలో రోడ్లపై ఆగి ఉన్న వాహనాల వద్ద దొంగతనాలు జరగకుండా ముందు జాగ్రత్తగా వారు తమ అధికారిక వాహనం పై చౌటుప్పల్ బస్టాండ్ నుండి బోర్రెలగూడెం స్టేజ్ వరకు హైవే వెంట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో, వారు ధర్మోజిగూడెం స్టేజ్ సమీపంలోని తిరుమల వెంచర్ ఆర్చి వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో కొన్ని వాహనాలు నిలిచి ఉండటాన్ని వారు గమనించారు.

దీంతో భరద్వాజ్ బైక్‌ను రోడ్డు పక్కన ఆపగా, నరేష్ కుమార్ రోడ్డు దాటి అవతలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు నుండి విజయవాడ దిశగా అతివేగంగా దూసుకొచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం నరేష్ కుమార్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఎస్సై అజయ్ భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం అయిన ఆయుష్ వైద్యాధికారి శృతి

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**

పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవం అయిన వైద్యాధికారి. డా.సృతి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలపై నమ్మకాలను పెంచాలని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ వైద్యాధికారిని గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్ .శృతి భర్త, చంద్రశేఖర్ మొదటి కాన్పు నొప్పులతో ఉదయం తెల్లవారు జామున ఉమ్మనీరు అంతా కోల్పోయి నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావడం జరిగింది వెంటనే స్పందించిన వైద్య సిబ్బంది డాక్టర్ పున్న నాగిని, బృందం, సిబ్బంది అంతా సకాలంలో స్పందించి అవసరమైన అన్నీ వైద్య పరీక్షలు నిర్వహించ పరిచర్యలు చేసి పండంటి 2.8 కేజీల ఆడబిడ్డకు జన్మనివ్వడం జరిగింది.పనిచేస్తున్న ఆసుపత్రిలోనే ప్రసవం కావటం ప్రజలందరికీ ఆదర్శంగా ఉండాలని తనకు సురక్షిత సాధారణ ప్రసవం చేసిన డాక్టర్ నాగిని,సిబ్బందికి అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు,డాక్టర్ శృతి కుటుంబ సభ్యులు తెలిపారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



**నేరేడుచర్ల (జనంసాక్షి)**

వాసవి క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను అధ్యక్షుడు నీలా రామ్మూర్తి సెక్రెటరీ చెరుకు రాము,కోశాధికారి చారకొండ వెంకటేశ్వర్లు,ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలో 60 మంది మహిళలు పాల్గొన్నారు.ముగ్గుల పోటీలకు జడ్జీలుగా కట్ట మాధవి, జగిని నర్స కుమారి, మురారిశెట్టి శ్రీదేవి, జడ్జిలుగా వ్యవహరించారు. మొదటి బహుమతి గుంటూరు వాసవి, రెండవ బహుమతి పాశం నందిని, మూడో బహుమతి జగని శ్రీలత, నాలుగో బహుమతి మాశెట్టి నర్మద, ఆరు కన్సిలేషన్ బహుమతులు అందజేశారు. ఈ ముగ్గులో పోటీల పాల్గొన్న 60 మంది మహిళలకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాసరావు, కందిబండ శ్రీనివాసరావు, కొత్త లక్ష్మణ్, పోతుగంటి సత్యనారాయణ, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, పివిటి ఉప్పల పుల్లయ్య, జోలుర్ అశోక్ ,గోపాలకృష్ణ ,గజ్జల కోటేశ్వరరావు, వెంపటి వెంకన్న, తదితరులు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## తెలంగాణ చెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కోదాడ విద్యార్థిని

**కోదాడ, జనవరి 13 ( జనంసాక్షి):**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మరియు జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 69వ జాతీయ పాఠశాలల స్థాయి చదరంగం పోటీలు జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీ లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో కోదాడ తేజ విద్యాలయ లో 6వ తరగతి చదువుతున్న విద్యార్దిని భూక్యా యోగిత తెలంగాణ చదరంగం అండర్ -14 బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించటం జరిగింది. జాతీయస్థాయిలో పాల్గొంటున్న అన్ని రాష్ట్రాల చదరంగం జట్లు నిర్వహించిన పెరెడ్ లో భూక్యా యోగిత ముందుండి తెలంగాణ క్రీడా జెండా తో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించడం జరిగింది.

డిశంబర్ 6,7,8 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో భూక్యా యోగిత ప్రథమ స్థానంలో నిలవడం వలన ఈ ఘనత జాతీయ స్థాయి పోటీల్లో దక్కడం జరిగింది. ఈ సందర్భంగా తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమాసోమిరెడ్డి భూక్యా యోగిత కు అభినందనలు తెలియజేస్తూ రాష్ట్రం నుండి ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.


## చంద్రయ్య కుటుంబానికి ఆర్థిక సహాయంగా బియ్యం అందజేత



**నూతనకల్ జనవరి 13 ( జనం సాక్షి)** మండల పరిధిలోని రామలింగా పురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మూరగుండ్ల సైదులు తండ్రి మూరగుండ్ల పెద్ద చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మున్న మల్లయ్య యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావులు చెరొక 50 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా మంగళవారం అంద జేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,గ్రామ శాఖ అధ్యక్షులు మొగుళ్ల వెంకన్న, వార్డు సభ్యులు ఉప్పుల వీరస్వామి యాదవ్,సంగినేని సురేందర్, గోవర్ధన్, నాయకులు కర్ణాకర్ రెడ్డి,రవీందర్ రెడ్డి,వీరమల్ల యాదగిరి, బండి అనిల్, మురళి,సంజీవరెడ్డి,పిట్టల లింగయ్య,సంపత్ మృతుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చిన సర్పంచ్

**నూతనకల్ జనవరి 13( జనంసాక్షి)**



మండల పరిధిలోని ఎర్ర పహాడ్ గ్రామ సర్పంచ్ గా ఎన్నిక కాగానే గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా చేస్తానని నాడు గ్రామ ప్రజలకు హామీ ఇచ్చాను అని సర్పంచ్ జి లింగరాజు యాదవ్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అన్నారు అన్నమాటకు నిదర్శనంగా రాబోయే వేసవి కాలం గ్రామంలో నీటి ఎద్దడి సమస్య లేకుండా నూతనంగా నాలుగు బోర్లు వేయించి, ఈరోజు మోటార్లను ప్రారంభించి పైప్ లైన్ ద్వారా రెండు ఓవర్ హెడ్ ట్యాంకులకు వాటర్ ని ఎక్కించి సంక్రాంతి పండగ ముందే గ్రామ ప్రజల దాహార్తిని తీర్చడం జరిగింది దీనికి ప్రజలు సంతోషిస్తూ సర్పంచ్ కి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సహకారంతో కొత్తచెరువులో చేప పిల్లల విడుదల

**సంస్థాన్ నారాయణపురం. జనవరి 13 (జనంసాక్షి):**
అల్లందేవిచెర్వు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తచెరువులో ఈ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ వారి సహకారంతో మంగళవారం ఆ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ మరియు అలందేవిచెర్వు గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజుగౌడ్ , సర్వేల్ సర్పంచ్ చిలకరాజు చందన రాజు గారి చేతుల మీదుగా చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఆరోగ్యవంతమైన చేపలను అందించడంతోపాటు గ్రామీణ యువతకు ఉపాధిగా కూడా ఈ చేపల పెంపకం ఉపయోగకరంగా ఉంటుందని, దీనికి సహకరించిన ఇ.ఎల్.వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ కి గ్రామపంచాయతీ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బ్రహ్మచారి, ఉపసర్పంచ్ ముక్కర్ల కవిత స్వామి యాదవ్ వార్డు సభ్యులు సుర్వి కృష్ణవేణి నరేష్ గౌడ్,అంతటి శివశంకర్ గౌడ్,సుర్వి సురేష్ గౌడ్,సుర్వి లింగస్వామి గౌడ్,గుండు లింగస్వామి గౌడ్,కారోబార్ అంతటి నాగరాజుగౌడ్, ఫౌండేషన్ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వం లక్ష్యం

### ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ, జనవరి 13(జనంసాక్షి)**
భూ నిర్వాసితుల కష్టాలను పరిష్కరించడంలో ప్రభుత్వం కీలక భూమిక పోషిస్తుందనీ,ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ పడతామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏ కే బి ఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ పైపు లైన్ నిర్మాణంలో వ్యవసాయ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెక్కులను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రాజెక్టుల ద్వారా ప్రభావితమైన ప్రజల హక్కులు, జీవన ఉపాధి ప్రభుత్వ బాధ్యత అని, భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.. ప్రాజెక్టు రిజర్వాయర్ ముంపు నిర్వాసితులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం పరిహారం అందిస్తుందని తెలిపారు. ఈ నష్టపరిహారం అక్కంపల్లి గ్రామానికి చెందిన 41 మంది రైతులు 4.13 గుంటలకు గాను 52,39,593/- రూపాయల విలువ గల చెక్కును స్వయంగా పంపిణీ చేయడం ఆనందంగా ఉంది అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 6691 ఎకరాలకు సాగునీరు అందిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రమణా రెడ్డి, ఇరిగేషన్ శాఖ డి ఈ నాగయ్య, శిల్పా, నాయకులు తెర సత్యనారాయణ రెడ్డి,డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి,సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి,హరి కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

### ముఖ్యఅతిథిగా జిల్లా గవర్నర్ చారుగుళ్ల

**భద్రాచలం జనవరి 13 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ లో భాగంగా మంగళవారం భద్రాచలం పట్టణం తాతగుడి సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వాసవి క్లబ్ భద్రాచలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారి వియన్ వనమా కిరణ్ కుమార్, వి ఎన్ పెనుగొండ సంతోష్ కుమార్, వివన్ నాళ్ళ సాయి చంద్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ వి 106 ఏ గవర్నర్ వాసవియన్ ప్రోగ్రెసివ్ గోల్డెన్ స్టార్ చారుగుళ్ల శ్రీనివాస్, విశిష్ట అతిథులుగా క్యాబినెట్ సెక్రటరీ అడ్మిన్ వి ఎన్. కె సి జి ఎఫ్ లు చింతల వినోద్ కుమార్, క్యాబినెట్ సెక్రటరీ సర్వీస్ వి ఎన్. 5 రేపాక ధనుంజయ రాజ మనోహర్, క్యాబినెట్ ట్రెజరర్ ఉడతా నగేష్ కుమార్, రీజియన్ చైర్ పర్సన్ వి ఎన్ సిల్వర్ కె సి జి ఎఫ్ బండారు కృష్ణయ్య, జోన్ చైర్మన్ వి ఎన్ ఫ్యామిలీ కె సి జి ఎఫ్ భూమా వెంకట చంద్రశేఖర్ విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ లో భాగంగా ముగ్గుల పోటీ కార్యక్రమం నిర్వహించిన క్లబ్ బాధ్యులను



ప్రశంసించారు. ఇదే విధంగా సేవా కార్య క్రమాలు చేస్తూ జిల్లా, అంతర్జాతీయ స్థాయి లో భద్రాచలం వాసవి క్లబ్ ముందుండేలా సేవా కార్యక్రమాలు చేయాలని, సంక్రాంతికి పండుగకు ముగ్గులకు గల సంబంధాన్ని సంప్రదాయాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణ మహిళలు, చిన్నారులు ఎంతో ఆనందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా రేపాక రూపవతి, యమ్ పద్మ, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు న్యాయ నిర్ణేతలను వనమా కిరణ్ దివ్య జ్యోతి దంపతులు సత్కరించారు. ప్రథమ బహుమతి మివి ఎన్. కె సి జి ఎఫ్ మిక్సర్ గ్రైండర్, ద్వితీయ బహుమతి ఇండక్షన్ స్టవ్, మూడవ బహుమతి వాటర్ కెటెల్, ఆరు కన్సోలేషన్ ప్రైజులు హాట్ బాక్సులు పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు వి ఎన్. కె సి జి ఎఫ్ చారుగుండ్ల రామకృష్ణ, వి ఎన్. కె సి జి ఎఫ్ పచ్చిపులుసు వెంకట సుబ్బారావు, వి ఎన్ సముద్రాల అనిల్ కుమార్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ఆర్య. వైశ్య సంఘం నాయకులు రేపాక శ్రీహరి, తూనుగుంట్ల లీలా కృష్ణమూర్తి, గోండేల పద్మ, చిరునోముల పుష్పావతి, కోటగిరి సుజాత, వనమా రామారావు, రమాదేవి రేపాక శ్లోక తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి శ్రీ కోదండ రామాలయంలో భక్తిశ్రద్ధలతో తిరుప్పావై కీర్తనలు. ప్రత్యేక పూజలు శ్రీ మహావిష్ణువుకి అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోదండ రామాలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున మహిళా భక్తులు యశోద అలంకరణలతో, చిన్నారులు గోపికల అలంకరణతో శ్రీకృష్ణుడికి భక్తిశ్రద్ధలతో, కీర్తనలు, కోలాటాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జనంసాక్షి పెనుబల్లి





## రేగులగూడెంలో బల్లాల వితరణ

**కారేపల్లి, జనవరి13(జనంసాక్షి) :**
రేగులగూడెం గ్రామపంచాయతీలోని ప్రధాన కూడళ్లలో పిట్టల కార్తిక్ సిమెంట్ బల్లాలను వితరణ చేశారు. కార్తిక్ తన తల్లిదండ్రులు పిట్టల రామకృష్ణ-ఉపేంద్ర ల జ్ఞాపకార్థం అందించిన బల్లాలను మంగళవారం సర్పంచ్ ఈసం మోతీవీరస్వామి, వార్డు సభ్యుల చేతుల మీదిగా ప్రారంభించారు. ఈసంధర్భంగా సర్పంచ్ దాతను అభినందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈసం అరుణ, గ్రామపెద్దలు ఈసం భాస్కర్, తురక నారాయణ, కల్తి రాంప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన నేనావత్ అభిలాష్ నాయక్ ఛాలెంజ్ క్రికెట్ టోర్నమెంట్

**దేవరకొండ, జనవరి 13(జనంసాక్షి)**
దేవరకొండ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గత వారం రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం దిగ్విజయంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్, సతీమణి జ్యోతి ప్రసన్న,స్పాన్సర్స్ బై అభిలాష్ నాయక్ పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాసన సభ్యులు నేనావత్ బాల నాయక్ మాట్లాడుతూ దేవరకొండలో ఇండోర్,అవుట్ డోర్ స్టేడియాలు అందుబాటులోకి వచ్చే విధంగా తప్పనిసరిగా కృషి చేస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దాహోదపడతాయని , గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి కిడాకారులను ప్రోత్సహించడం కోసం ఇలాంటి టోర్నమెంటులో పెద్ద ఎత్తున నిర్వహించడానికి దోహదపడుతుం దని అన్నారు. క్రీడాకారులకు ఎల్లవేళలా



అందుబాటులో ఉంటానని, క్రీడల అభివృద్ధికై నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ ని విజయవంతం చేసినందుకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులని అభినందిస్తూ అధ్యక్షుడు న్ఎన్ వి టీ ను ప్రత్యేకంగా అభినందించాడు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్ వి టీ,శ్రీధర్ గౌడ్, రాపోలు నిరంజన్, శేఖర్,సన్నీ, శరత్,లీట్టు, యూనుస్ రాంసింగ్ నాయక్ సందీప్,పెద్దిరాజు, ఈశ్వర్, మోసిన్ , వెంకటేష్, నవీన్,మహేష్, వివిఆర్, బుడిగ వేంకటేష్ వల్లమాల ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా కళ్యాణ లక్ష్మి

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో చెక్కుల పంపిణీ





**చండూరు జనవరి 13 (జనంసాక్షి)** మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చండూరు మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చండూరు మండల తహసీల్దార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోరిమి ఓంకారం, మరియు చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించడంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సజావుద్దీన్, నాయకులు అబ్బనబోయిన లింగయ్య, ఇరిగి రాజు, బురకల ఎలక్షన్, సోము లింగస్వామి పాల్గొన్నారు.అలాగే స్థానిక ప్రజాప్రతి నిధులైన ఉడతలపల్లి సర్పంచ్ కావలి శివాని సురేష్, ధోనిపాముల సర్పంచ్ స్వామి, కొండాపురం మరియు కస్తాల సర్పంచులుకార్యక్రమంలో భాగస్వాములయ్యారు. వీరితో పాటు నాయకులు విశ్వనాథ్, కావలి రుద్ర, పాండు లింగస్వామి, నరసింహ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుషిపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేరువంచ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి

**కల్లూరు జనవరి 13(జనంసాక్షి)..** సాహసమే ఊపిరిగా, పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని సామాజిక వర్గాల ప్రజల అండతో ఆదరాభిమానాలతో ఇటీవల జరిగినపేరువంచ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా (కాంగ్రెస్ ) ఎన్నికల రణరంగంలో పంచముఖ పోటీలో ఏకైక మహిళ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగి వ్యూహాత్మకంగా వ్యవహరించి అఖండ మెజారిటీతో విజయం సాధించిన మహిళా నేత కీసర నిర్మల మోహన్ రెడ్డి. మంగళవారంసత్తుపల్లి పట్టణంలో రాణి సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్ నందు తెలంగాణ పిసిసిప్రధాన కార్యదర్శి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తరఫున నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల అభినందన సభ అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలం పేరువంచ గ్రామ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి , ఉపసర్పంచ్ పరిమి కృష్ణవేణి భరత్ లను ముఖ్యఅతిథిగా విచ్చేసిన, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ,ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ లతో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలు బహుకరించి అభినందించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని , ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సాకారాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ నాయకులు కీసర మోహన్ రెడ్డి సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు , పాల్గొన్నారు.

**ఉప సర్పంచ్ పరిమి కృష్ణవేణి భరత్ లను సన్మానించి అభినందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్**





# మున్సిపాలిటీ ఎన్నికలకు భయపడాల్సింది కాంగ్రెస్ పార్టీ కాదు బిఆర్ఎస్ పార్టీ



**మధిర, జనవరి 13 (జనంసాక్షి):** మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మధిర మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిర్యాల వెంకటరమణ గుప్తా మాట్లాడుతూ.... నిన్న మధిర మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ నామా నాగేశ్వరరావు గారు మాట్లాడిన విధానం చూస్తే చాలా విడ్డూరంగా ఉంది మున్సిపాలిటీ ఎన్నికలకు భయపడాల్సింది బిఆర్ఎస్ పార్టీ గాని కాంగ్రెస్ పార్టీ కాదు అన్నారు..గత పది సంవత్సరాల కాలం మీకు ప్రజలు పరిపాలన ఇస్తే మున్సిపాలిటీ చైర్మన్ గాని స్థానిక నాయకులు గానీ మధిరను అభివృద్ధి చేసింది ఏమీ లేదు.. మీరు అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నారే తప్ప, ఫలానాది అభివృద్ధి చేశాం అని చెప్పుకోలేకపోతున్నారు. పత్రికా ముఖంగా కూర్చుందాం రండి మధిర పట్టణాన్ని ఎవరు అభివృద్ధి చేశారు మాట్లాడుకుందాం.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ఎన్ని శంకుస్థాపనలు చేసాము, ఎన్ని డెవలప్మెంట్ పనులు చేసామో, పదేళ్ల కాలంలో మీరు ఎన్ని శంకుస్థాపనలు చేశారో ఎన్ని అభివృద్ధి పనులు చేశారో పత్రిక ముఖంగా చర్చిద్దాం సవాల్ విసిరారు.మధిర ఆర్ఓబి పై గుంటలు పడి జనం వెన్నుపూసలు నొప్పి వస్తుందని బాధపడుతున్న కనీసం ఆ గుంటలని పూడ్చలేకపోయారు మీరు, కోర్టు భవనం శిథిలావస్థలో ఉంటే నూతన భవనం ఏర్పాటు చేసింది భట్టిగారే, శిథిలావస్థలో ఉన్న ఏ భవనం గురించి అయినా గానీ ఈ పది సంవత్సరాల్లో మీరు పట్టించుకున్న దాఖలాలు లేవు, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ మున్సిపాలిటీ భవనము, పాత బస్టాండు ఇవి ఏమీ మీరు పట్టించుకోలేదు మధిరకు ఫోర్ లైన్ రోడ్ నిర్మించింది భట్టి నే సెంట్రల్ లైటింగ్ పెట్టింది, ట్యాంక్ బండ్ మంజూరు చేయించింది మల్లు భట్టి విక్రమార్క అని, పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న ఏతీబ పార్టీ మధిర మున్సిపాలిటీలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అయిన ఇవ్వగలిగారా, ఇళ్ల స్థలాల ప్లాట్లు ఒక్కరికైనా ఇవ్వగలిగారా, పదేళ్ల పాలనల్లో పాలనలో మధిర పట్టణానికి అది చేశాము, ఇది చేశామని చెప్పుకోవటమే కానీ చేసిన పని ఒక్కటైనా ఉందా ఉంటే చెప్పండి మధిర మున్సిపాలిటీలో ఓటు అడిగే హక్కు ఒక్క కాంగ్రెస్ పార్టీ మల్లు భట్టి విక్రమార్క గారికి ఉంది. రెండు సంవత్సరాల లోనే మధిర మున్సిపాలిటీకి రెండు, మూడు వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువస్తే, రాబోయే 3 సంవత్సరాలలో వేలకోట్ల రూపాయలు మధిర అభివృద్ధికి మల్లు భట్టి విక్రమార్క గారు తీసుకొస్తారు, ఓటు అడగటానికి భయపడాల్సింది మీరు ఈ పదేళ్లలో మీ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆస్తులు పెరిగాయి కానీ మధిర మున్సిపాలిటీ అభివృద్ధి చెందలేదు, మధిర మున్సిపాలిటీ ప్రజలు విజ్ఞానవంతులు తెలివైన వారు వారికి తెలుసు ఎవరివల్ల అభివృద్ధి జరుగుతుంది అనేది రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం. మధిర అభివృద్ధి భట్టి విక్రమార్క తోనే సాధ్యం అన్నారు..ఈ సమావేశంలో మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ పట్టణ డివిజన్ కమిటీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు మాగం ప్రసాద్, కోట నాగరాజు, మైలవరం చక్రి ఆత్మ కమిటీ డైరెక్టర్ అల్లాడి గోపాలరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, ఆవుల కిరణ్, పత్తేపరపు సంగయ్య, తన్నీరు రామకృష్ణ పాల్గొన్నారు.



# శ్రీవాసవి సేవాసమితి జిల్లా కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్యాపేట (జనంసాక్షి):** శ్రీవాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ను జిల్లా కేంద్రం లోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మంగళవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా గౌరవ సలహాదారులు గోపారపు రాజు, అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా సమాజంలోని అట్టడుగు,పేద వర్గాలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు.సూర్యాపేటలోని పలు దేవాలయాలలోని దేవతామూర్తులతో రూపొందించిన క్యాలెండర్ ను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.గతంలో శ్రీవాసవి సేవా సమితి ద్వారా బతుకమ్మ పాటల పుస్తకంతో పాటు భక్తి మాల పుస్తకం రూపొందించినట్లు తెలిపారు. త్వరలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేసుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజ సేవలో ఆసక్తి గల వారు సభ్యులుగా చేరవచ్చన్నారు. 9 ఏళ్ల క్రితం పూరి సురేష్ శెట్టి స్థాపించిన శ్రీవాసవి సేవాసమితి అంచలంచెలుగా ఎదుగుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు పోతుగంటి వెంకటేశ్వర్లు, కలకోటి నరసయ్య, సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్,తప్పి అనిల్ కుమార్, వీరవెల్లి విజయ్ శంకర్, మహంకాళి ప్రణీత్, వాసా చంద్రశేఖర్,కమిటీ సభ్యులు పోలా లక్ష్మీనారాయణ,కోట శివ,చల్లా శశిధర్,కొండ అనిల్, బిక్కుమల్ల సంతోష్,మిర్యాల పవన్, బెలిదే అంజయ్య,గుడిపాటి రమేష్,గోళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కట్టా గాంధీ మృతి పట్ల టిడిపి ఘన నివాళి



**మధిర, జనవరి 13 (జనంసాక్షి):** బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన అహర్నిశం పోరాడిన సిపియం యోధుడు, మధిర మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కట్టా గాంధీ మంగళవారం వారి స్వగ్రామం పోచారం లో కన్నుమూశారు. కట్టా గాంధీ పార్థివదేహానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్ బాబు, ఐటిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి వేమూరి సునీల్, తెలుగు యువత రాష్ట్ర బాధ్యులు యలమంచిలి శివ, ఐటిడిపి నియోజకవర్గ బాధ్యులు అనుమోలు సతీష్, వెన్నవల్లి మాజీ యమ్ పిటిసి ఉప్పు సుబ్బారావు గాంధీ గారి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు. కట్టా గాంధీ గారి కుమారులు లాయర్ పూర్ణచంద్రరావు, రాష్ట్ర టిడిపి సాంస్కృతిక విభాగం బాధ్యులు కట్టా సుధీర్ లను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

# నూతన తాసిల్దార్ గా పదవి బాధ్యతలు చేపట్టిన రామ్ నరేష్



**దమ్మపేట జనవరి 13 (జనంసాక్షి):** దమ్మపేట మండల నూతన తహసీల్దార్ గా రామ్ నరేష్ పదవి బాధ్యతలు స్వీకరించారు. దమ్మపేట మండలానికి బదిలీపై వచ్చి శుక్రవారం తహసీల్దార్ గా బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా నూతన తాసిల్దార్ రామ్ నరేష్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,మండల ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్యాలయం నందు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తానని తెలిపారు.

# సృజనాత్మకతను వెలికి తీయడం కోసమే ముగ్గుల పోటీలు

## యుటిఎఫ్ జిల్లా నాయకులు సంగు వనిత, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొలుపుల సహన





**భువనగిరి,జనవరి 13(జనంసాక్షి)** మహిళల్లో దాగి ఉన్న శక్తిని సృజనాత్మకతను వెలికి తీయడం కోసమే ఎస్ఎఫ్ఐ విద్యార్థిని కమిటీ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారని యుటిఎఫ్ జిల్లా నాయకురాలు సంగు వనిత, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సహన అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగాఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ బండారు ఇందు రాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడారు... మహిళలు ఉన్నటువంటి శక్తిని సృజనాత్మకవెలికి తీయడం కోసం 30 సంవత్సరములుగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహిళలు ఇంటికి పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్నటువంటి దాడులు అత్యాచారాలు వ్యతిరేకంగా ముందుండి నిలబడాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో గాని మహిళల మీద అత్యాచారాలు దాడులు పెరిగాయన్నారు. సమాజంలో మహిళల పట్ల నేటికి వివక్షత కొనసాగుతుందన్నారు. ఈ అసమానతలను వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్రభుత్వాలు మహిళలపై దాడులు జరుగుతున్న గాని దాడులను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలకు అండగా ఉండాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంస్థ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందన్నారు. చదువు పోరాడు అనే నినాదంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. విషయాన్ని అవగాహన చేసుకోవాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని కోరారు. రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షులు కొలుపుల అమరేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ లో చేరడం వల్లనే తాము ఈ స్థాయి వరకు వచ్చామన్నారు. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి మరింత చేయుత ఇవ్వడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కో-కన్వీనర్లు ప్రశాంతి,భబీత,హారిక శివాని, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల,కార్తీక్, ఆరే విజయ్ కుమార్, బర్ల వెంకటేష్, అజయ్ సింగ్, కొల్పుల సోహన్, కొత్త లలిత పాల్గొన్నారు.

# గృహజ్యోతి పథకం పేద ప్రజలకు వరం




**రామన్నపేట, జనవరి 13 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన గృహజ్యోతి పథకం పేద ప్రజలకు వరమని చౌటుప్పల్ విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ఎస్.మల్లికార్జున్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కే.శ్రీకాంత్ లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వెల్లంకి, సిరిపురం గ్రామాలలోని వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలుపుతూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు సందేశం ఇవ్వడంతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ జారీ చేసిన ప్రతులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని మండలంలో గృహ జ్యోతి పథకం ఉచిత విద్యుత్ లబ్ధిదారులు10267, వ్యవసాయ రైతులు 8582 , వలిగొండ మండలంలో గృహాజ్యోతి పథకం ఉచిత విద్యుత్ లబ్ధిదారులు 11745, వ్యవసాయ లబ్ధిదారులు 11664 మంది ప్రజలు లబ్ది పొందుతున్నారని తెలిపారు.వారి వెంట రామన్నపేట ఏఈ వి. కోటేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# పరశురాం పరివార్ హిందూ సంస్థ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**బూర్గంపహాడ్ జనవరి 13 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం గాంధీనగర్ శ్రీ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద పరశురాం పరివార్ హిందూ సంస్థ వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ శివరాం నాయక్, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొని ముగ్గుల పోటీలు, సంక్రాంతి పండుగ, పరశురాం పరివార్ చేసే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పరశురాం పరివార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ మాట్లాడుతూ సంస్థ స్థాపించినప్పటి నుండి మంచి మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని, మునుముందు కూడా మంచి మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో 80 మంది పైగా పాల్గొనగా వారిలో మొదటి, రెండవ, మూడవ బహుమతులతో పాటు పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరుశురాం పరివార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కరకు ప్రసాద్, జనసేన పార్టీ కసన అంకబాబు, శ్రీ గాయత్రి జ్యోతిష కేంద్రం దేవులపల్లి సాయి కిరణ్ శర్మ, ఆలయ అర్చకులు వెల్ది శివ సాయి శర్మ, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, జడ్జిలు శుభశ్రీ (అడ్వకేట్), ప్రభవతీ, పరశురాం పరివార్ సభ్యులు హనుమంతు, భవానీ, శ్యామల, ప్రమీల, జయ, ఇందు, నాగలక్ష్మి, నాగ దేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా భోగి - సంక్రాంతి సంబరాలు



**హాలియా, జనవరి 13 జనంసాక్షి:** హాలియా ఆర్యవైశ్య యువజన సంఘం తోడ్పాటుతో, హాలియా వాసవి క్లబ్ గ్రేటర్ వనిత క్లబ్ హాలియా ఆధ్వర్యంలో భోగి పండ్ల, సంక్రాంతి సంబరాలు హాలియా వైభవ్ బ్యాంక్వెట్ హాల్ లో ఉత్సాహంగా జరిగాయి. భోగి పళ్ళు, పతంగులు, సంబరాలతో కార్యక్రమం కళ్లకు విందుగా నిలిచింది.ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం యువ అధ్యక్షుడు బచ్చు సతీష్, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొండూరు శోభన్ బాబు, వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ గందే మహేష్, జోన్ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ అధ్యక్షులు కేసి శేఖర్, సముద్రాల అరవింద్, కొత్తూరు రామయ్య, ఆర్ ఎస్ కుక్క, డపి ఝాన్సీ లక్ష్మి, హాలియా వనిత క్లబ్ అధ్యక్షురాలు నిర్మల దేవి, చార్టర్ అధ్యక్షురాలు గార్లపాటి శోభ, మారం అనిత, వీరమల్ల కళావతి, గార్లపాటి ధనమ్మ, బచ్చు అశ్విని, గట్టు శాంతమ్మ, సముద్రాల త్రివేణి, బచ్చు రత్నమాల తదితరులు పాల్గొన్నారు.ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు.

# ప్రాణం తీసిన ఈత సరదా..



**మర్రిగూడ, జనవరి 13 (జనంసాక్షి)** :మర్రిగూడ మండలంలోని వెంకేపల్లి గ్రామానికి చెందిన అంజయ్య శారదల కుమారుడు అక్షయ్ కుమార్ (10) 6వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో మంగళవారం స్నేహితులతో కలిసి గ్రామంలో శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణం మట్టి కోసం తీసిన గుంతలలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గుంత లోతు ఎక్కువగా ఉండటంతో నీళ్లలో మునిగి ఊపిరాడక చనిపోయాడు. అక్షయ్ కుమార్ కు ఈత రాకపోవడం వల్ల చనిపోయినట్లు స్థానికులు తెలిపారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



**సూర్యాపేట (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య నేతృత్వంలో సూర్యాపేట జిల్లా శాఖ,మండల శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆ సంఘ 2026 డైరీని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు,సంఘ జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు,ప్రధాన కార్యదర్శి దండ శ్యాంసుందర్ రెడ్డి,జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎంఏ హమీద్ ఖాన్, గౌరవ అధ్యక్షులు కె.రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.విద్యాసాగర్ రావు, సూర్యాపేట మండల అధ్యక్షులు సుదగాని నాగేశ్వర రావు, కార్యదర్శి ఎస్.యాదగిరి,డి.రవీందర్ రెడ్డి,ఎస్. సుధాకర్,జిల్లా,మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి మానవత్వం చాటుకున్న కుందూరు జైవీర్ రెడ్డి



**హాలియా, జనంసాక్షి:** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో కాంగ్రెస్ కార్యకర్త కానమోని గౌతమ్ ముదిరాజ్ పెరలాసిస్ తో బాధ పడుతుండగా ఇట్టి విషయం స్థానిక నాయకులు తెలియజేయడం తో స్థానిక శాసన సభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి వెంటనే బాధితుడి ఇంటికి వెళ్లి 20,000 రూపాయలు ఆర్థిక సహాయం చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌతమ్ కుటుంబానికి అండగా ఉంటా అని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో మండల పార్టీ అధ్యకుడు కుందూరు వెంకట్ రెడ్డి, నల్గొం డ జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజా రమేష్ యాదవ్, రిటైర్డ్ హెడమాస్టర్ చందు నాయక్,కానమోని రాజు, తోడేందల రాజా శేఖర్ యాదవ్,సైదా, దండ రాంరెడ్డి,లింగాల మహేష్, సాయి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తాజ్ పూర్‌లో ముగిసిన ముగ్గుల పోటీలు

## ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు , విజేతలకు నగదు బహుమతులు అందజేసిన సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్

**భువనగిరి రూరల్, జనవరి 13(జనంసాక్షి)**
భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు . ముగ్గుల పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు . విజేతలుగా నిలిచిన మహిళలకు గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ చేతుల మీదుగా మొదటి బహుమతి 2500 రూపాయలు , ద్వితీయ బహుమతి 1500 రూపాయలు , తృతీయ బహుమతి 1000 రూపాయల నగదు బహుమతులు అందజేశారు . ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు . ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ తాజ్ పూర్ గ్రామ ప్రజలకు , మహిళా సోదరీమణులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు . ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలకు , పోటీలో పాల్గొన్న ప్రతి మహిళా






సోదరికి శుభాకాంక్షలు తెలిపారు . గ్రామంలోని ప్రతి కుటుంబం ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు . గ్రామ పంచాయితీ పాలక వర్గ సభ్యులకు , గ్రామ సిబ్బందికి , గ్రామ ప్రజలకు భోగి సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు తెలిపారు .

# సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



నల్గొండ జిల్లా ప్రజలకు, దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో మకర సంక్రాంతి పండుగ సుఖ సంతోషాలు నింపాలని కోరుకున్నారు. మకరరాశిలోకి సూర్యుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్తరాయణం పుణ్యకాలమన్నారు. ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు,సుఖ సంతోషాలు నింపాలని,నూతన వెలుగులు, సరి కొత్త విజయాలు కలగాలని, ఆకాంక్షించారు. ప్రజలు సిరి సంపదలతో, భోగ భాగ్యాలతో తులతూగాలన్నారు. సంక్రాంతి పండగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలన్నారు.

జనంసాక్షి , దేవరకొండ



# జెండా పండుగను విజయవంతం చేద్దాం

## ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయాలి

**కారేపల్లి, జనవరి13(జనంసాక్షి) :**
కారేపల్లి మండలంలో ఈనెల 26న కాంగ్రెస్ పతాకాన్ని ఇంటింకి ఎగరవేసి పండుగను జరుపుకుందామని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఎస్సీ సెల్ ఇంచార్జీ దర్జీ చెన్నారావు అన్నారు. మంగళవారం కారేపల్లిలోని పార్టీ కార్యాలయంలో సింగరేణి మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో చెన్నారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేలా చేయటానికి గడపగడపకు ప్రచారం చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం సమిష్టిగా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కందుల శ్రీనివాసరావు, చింతనిప్పు మాధవరావు, శ్రీలత, ఎండీ.కైజర్, మొగలి నాగరాజు, అడ్డగోడ ఐలయ్య, కడియాల సుధాకర్, వాంకుడోత్ గోపాల్, ఆదెర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలో సంక్రాంతి సంబురాలు ప్రారంభం

**కారేపల్లి, జనవరి13(జనంసాక్షి) :**
పల్లెలో సంక్రాంతి సంబురాలు ప్రారంభమైనాయి. పండుగకు పాఠశాలలకు సెలవు ఇవ్వటంతో పిల్లలు గాలి పటాలు ఎగరవేస్తూ కేరితలు కొడుతున్నారు. పండుగనాడు కొత్త ముగ్గులు వేయాలని అతివలు కొత్త ముగ్గుల ప్రాక్టిస్, పిండివంటలు చేయటంలో నిమగ్నమైనారు. పల్లెలో అరిసెలు, సకినాలు, జంతికలు, కారపూస వంటి పిండి వంటలు ప్రతి ఇంట్లో చేయటం అనవాయితీ. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, గ్రామీణ క్రీడలు నిర్వహిస్తుండటంతో సందడిగా మారాయి.



## సిమెంట్ కర్మగారంలో కాంట్రాక్ట్

# కార్మికులకు క్రికెట్ పోటీలు

చింతలపాలెం(జనంసాక్షి)
సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలం, దొండపాడు గ్రామంలో జువారి సిమెంట్ ఫ్యాక్టరీ నందు రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు కంపెనీ క్రికెట్ పోటీలు నిర్వహించారు,ఈ పోటీలలో మొత్తం ఐదు జట్లు పాల్గొనగా మొదటి బహుమతి విజేత సతీష్ టీమ్,రెండో బహుమతి విజేత షేక్ నజీర్ టీమ్ వారికి జువారి సిమెంట్స్ ప్లాంట్ హెడ్ జివిఎన్ బి రావు చేతుల మీదుగా బహుమతి ప్రధానం మరియు షీల్డ్ లు బహుకరించారు ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ కంపెనీ సెక్రటరీ గిడ్డి కిషోర్,మెకానికల్ హెడ్ కే ఏ వెంకటేశ్వర్లు,హెచ్ఓడి లు,ఎంప్లాయిస్ మరియు కాంట్రాక్టర్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ రెడ్డి,సుబ్బారెడ్డి,తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



# రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస నియోజకవర్గం అభివృద్ధిపై లేదు

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధ్వజం



**చండూరు జనవరి 13 (జనంసాక్షి)**
మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా మాయమాటలతో సబ్బండ వర్గాల ప్రజలను మోసం చేస్తూ... పబ్బం గడుపుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా లో ఇద్దరు మంత్రులు ఉన్నా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదన్నారు. తెలంగాణ ఇంజనీర్లు తయారు చేసిన డీ.పీ.ఆర్ ఆమోదిస్తే తెలంగాణలోని మునుగోడు ప్రాంతం లోని శివన్నగూడెం, కిష్టరాంపల్లి ప్రాజెక్టు, నక్కలగండి కి నీళ్లు రావడంతో నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అయ్యేదన్నారు. కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వం సమగ్ర విషయాలతో సుప్రీంకోర్టుకు వెళ్లకుండా అవగాహన లోపంతో తప్పుడు సమాచారం ఇస్తే సుప్రీంకోర్టు తిరస్కరించిందన్నారు. తెలంగాణలో నీటి సమస్య తీరాలంటే రాష్ట్రంలో మరోసారి బి.ఆర్.ఎస్ అధికారంలోకి రావాల్సిన అవశ్యకత ఉందని.. అది కె.సి.ఆర్ తోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పునరాలోచిస్తున్నారని అందుకే మొన్నటి సర్పంచ్ ఎన్నికలలో బి.ఆర్.ఎస్ పార్టీకి పట్టం కటారన్నారు. నేడు ప్రభుత్వ సలహాదారులుగా చంద్రబాబు మనుషులు ఉన్నారని దీంతో రాష్ట్రంలో నేడు జలదోపిడి జరుగుతుందన్నారు. ఇక మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి సాగునీటి పై రోడ్లపై ఎలాంటి అవగాహన లేదన్నారు. ఆయనకు మంత్రి పదవీ పై ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేదన్నారు. మంత్రి పదవి వచ్చేది తెలవదు గాని నిత్య మంత్రి పదవి స్మరణతో నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని అన్నారు. చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీలతోపాటు చండూరు రెవిన్యూ డివిజన్ గా తానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని అనేక విధాలుగా నేను అభివృద్ధి చేస్తే.. ఆయన చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమన్నారు రాజగోపాల్ రెడ్డి పద్నాలుగు సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా ఉండి నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికి కూడా అభివృద్ధి పనిచేయలేదని అన్నారు. చేసిన పనులకు బిల్లులు ఇచ్చే దిక్కులేదు కానీ రానున్న రెండు సంవత్సరాలలో అభివృద్ధి చేస్తాను అనడం సిగ్గుచేటు అన్నారు. ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ రానున్న మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సమయత్తం కావాలని సూచించారు. కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొత్తపాటి సతీష్, మున్సిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు వెంకన్న, బి.ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మునగాల నారాయణరావు,ఎత్తపు మధుసూదన్ రావు, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, చండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం మాధవి వెంకటరెడ్డి, యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు,బి.ఆర్.ఎస్ మండల నాయకులు రావిరాల నగేష్, ఇరిగి రామన్న, జగదీష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు ప్రతి ఏటా బడ్జెట్లో నిధుల కోతను విధిస్తూ పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా వివక్ష

**మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 16, 17 జిల్లా వ్యాప్తంగా జీపు జాత ఈనెల 19న భువనగిరి జిల్లా కేంద్రంలోని రైతు బజారు దగ్గర నిరసన సభ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ..**



**భువనగిరి, జనవరి 13(జనంసాక్షి)**

కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పార్లమెంటులో ఈ మధ్యకాలంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ , విబి జి రామ్ జీ చట్టం, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 16,17 తేదీలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జీపు జాత మరియు 19వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద నిర్వహిస్తున్ననిరసన సభలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమటిరెడ్డి చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశం పిలుపునిచ్చినారు. సుందరయ్య భవన్, భువనగిరిలో జీపు జాత మరియు నిరసన సభ కరపత్రంను ఆవిష్కరణ చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారి కార్మికులకు, కర్షకులకు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా వారి యొక్క హక్కులను, చట్టాలను కాలరాస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రజలపై భారాల మోపుతున్నారని విమర్శించారు. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, జీవోలను మార్చి వారి పొట్టలు కొడుతున్నారని తెలిపారు. ప్రధానంగా ఈ మధ్యకాలంలో పార్లమెంటులో తనకు బలము ఉందనే భావనతో ఇష్టమొచ్చిన రీతిగా అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్, విబి జి రామ్ జి చట్టం, జాతీయ విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టం తీసుకొచ్చారని ఇవి అమలులోకి వస్తే జిల్లాలో పనిచేస్తున్న పరిశ్రమల కార్మికులకు రానున్న కాలంలో ఇప్పటి వరకు పొందుతున్న హక్కులు, సౌకర్యాలు లేకుండా పోతాయని అన్నారు. యాజమాన్యాలు తన ఇష్టానుసారంగా కార్మికుల చేత పనిచేయించుకుంటాయని, కార్మికులపై మరింత నిర్బంధం పెరుగుతుందని, ప్రశ్నించిన వారికి నోటీసులు ఇచ్చి ఉద్యోగం నుంచి తీసేస్తారని అందుకే కార్మికులు యూనియన్ల కతీతంగా, ప్రాంతాలకతీతంగా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈ ప్రభావం స్కీం వర్కర్స్, గ్రామపంచాయతీ కార్మికుల పైన పడనున్నదని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తుందని అన్నారు. విద్యుత్తు ప్రైవేటీకరణ దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం చేయనున్నదని, అది గనుక అమలు జరిగితే జిల్లాలో రైతాంగం చేసిన కష్టమంతా కరెంటు బిల్లులకే సరిపోతుందని, రైతాంగం అప్పులపాలై గతంలో మాదిరిగా ఆత్మహత్యల పరంపర కొనసాగనున్నదని అన్నారు. వ్యవసాయంను పడావాపెట్టి పట్టణాలకు వలసలు వెళ్లి కూలి పనులు చేసుకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తాయని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని స్కీముగా మార్చి నూటికి 60 శాతం నిధులు మాత్రమే కేంద్రం భరిస్తామని, మిగతా 40 శాతం రాష్ట్రాలు భరించాలని పార్లమెంటులో ఆమోదం తీసుకున్నదని అన్నారు. దీన్ని అమలు జరిపితే జిల్లాలో ఉపాధి హామీ పనులు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులున్నాయని అన్నారు. విత్తన సవరణ బిల్లు ద్వారా విత్తనాల ధరలు మరింత పెరుగనున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి కేంద్రాల మీద కేంద్రం పెత్తనం చేయనున్నదని అన్నారు. విత్తనోత్పత్తిలో బహుళ జాతి కంపెనీల ప్రమేయం పెరగనున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ కాలంలో కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల రూపాయల రాయితీనిచ్చిందని అన్నారు. ఒక్కసారి కూడా రైతులకు రుణమాఫీ చేయలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలకు ప్రతి ఏటా బడ్జెట్లో నిధుల కోతను విధిస్తూ పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా వివక్ష ప్రదర్శిస్తుందని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడం లేదన్నారు. కార్మికులను బానిసలుగా చూస్తూ రోజు వేతనం 265 రూపాయలు నిర్ణయించారని అన్నారు. ఈ వేతనంతో ఒక్క వ్యక్తి కూడా బ్రతకలేడు, కుటుంబం ఎట్లా బతుకుతుంది అని ప్రశ్నించారు. రైతాంగానికి కనీస మద్దతు ధర పెంచే కాడ గాని, వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు పెంచే కాడ బిజెపి ప్రభుత్వానికి చేతులు రావట్లేదని అన్నారు. అందుకే కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చౌటుప్పల్, నారాయణపురం, రామన్నపేట, వలిగొండ, పోచంపల్లి, బీబీనగర్ 17న భువనగిరి, బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, ఆలేర్, మోటకొండూర్, ఆత్మకూర్, మోత్కూర్ మండలాలలో జీపు జాత నిర్వహించి వందలాది మంది కార్మికులతో, కర్షకులతో, వ్యవసాయ కూలీలతో 19వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య పాల్గొంటున్నారని తెలియజేసినారు. ఇంకా ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మధ్యబోయిన సుందర్ పాల్గొన్నారు.



## నూతనకల్ లో సీఎం కప్ టార్చి ర్యాలీ

**నూతనకల్ జనవరి 13( జనంసాక్షి)**

నూతనకల్ మండల కేంద్రంలో సీఎం కప్ టార్చి ర్యాలీ ఎంపీడీఓ సునీత, ఎమ్మార్వో శ్రీనివాస్ తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి హాజరై నూతనకల్ మినీ స్టేడియంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత క్రీడా ప్రతిభను వెలికితీయడం కొరకు ప్రభుత్వం సీఎం కప్ 2026 క్రీడా పోటీలను ప్రారంభించిందని మంగళవారం తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. తహసిల్దార్ శ్రీనివాస రావు మాట్లాడుతూ పల్లెలోని యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, దీనివల్ల శారీరక దృఢత్వం తో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా లభిస్తుందన్నారు. అలాగే తాము ఎంచుకున్న క్రీడల్లో కష్టపడి రాణిస్తే పల్లె స్థాయి నుండి ప్రపంచ స్థాయి ఛాంపియన్లు గా ఎదుగొచ్చని అన్నారు. సి.ఎం కప్ ద్వారా ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు క్రీడా ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికను కల్పించిందన్నారు. ఎంపీడీవో సునీత మాట్లాడుతూ క్రీడాకారులు యువత సీఎం కప్ 2026 అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సర్పంచులు మహేశ్వరం మల్లికార్జున్, గుగులోత్ కృష్ణ నాయక్ పాండవుల లింగయ్య, జటంగి రేణుక కృష్ణ యాదవ్,జటంగి నాగలక్ష్మి- గణేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, ఏపీఎం, ఆర్ ఐ,ఏ పీ ఓ, పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బంది,పంచాయతీ సిబ్బంది,వివిధ,క్రీడాకారులు క్రాంతి, సుమన్ రెడ్డి, సురేందర్ గౌడ్, దాసరి శ్రీను,అనిల్, శరత్,గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పార పట్టిన సర్పంచ్ మత్రు

### దుబ్బతండాలో ముమ్మరంగ పారిశుధ్య పనులు

**కారేపల్లి, జనవరి13(జనంసాక్షి) :**

దుబ్బతండా గ్రామపంచాయతీలో సర్పంచ్ అంగోత్ మత్రు ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. దుబ్బతండా, మేకలతండా గ్రామాలలో సైడ్ కాలువలలో పుడిక తీయుట, రహదారికి ఇరువైపుల చెత్తకుప్పలను తొలగింపును చేశారు. సర్పంచ్ మత్రు స్వయంగా పార పట్టి పనులను నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ నేతృత్వంలో దుబ్బతండా గ్రామపంచాయతీలోని సమస్యలను పరిష్కరించున్నట్లు తెలిపారు. గ్రామంలో అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అందించటమే ధ్యేయంగా పని చేస్తానన్నారు.



## సంఘ బలోపేతానికి కృషి చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**

సూర్యాపేట జిల్లా పురగిరి క్షత్రియ పెరిక సంఘం జిల్లా కార్యవర్గ నూతన అధ్యక్షులు సముద్రాల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తిపాక జనార్ధన్, జిల్లా యువజన అధ్యక్షులు బుడిగం కిరణ్ కుమార్ జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు.జిల్లా పురగిరి క్షత్రియ సంఘం నూతన అధ్యక్షులు సముద్రాల రాంబాబు తన కార్యవర్గం తో అందరిని కలుపుకొని పోతూ సంఘ పటిష్టతకు పాటుపడాలని సూచించారు. పురిగిరి క్షత్రియ పెరిక కులానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ సంఘం అధ్యక్షులు పత్తిపాక వేణుధర్, సహ అధ్యక్షులు యర్రంశెట్టి రామ లింగయ్య, సంయుక్త కార్యదర్శి నట్టే కిరణ్ కుమార్, ప్రచార కార్యదర్శి దేవరగట్ల సతీష్, మార్కెట్ డైరెక్టర్ ఆర్తి కేశవులు, కుల ప్రముఖులు శ్రీరామ్ వెంకట్, మాజీ మార్కెట్ డైరెక్టర్ దాచేపల్లి భరత్,పిన్నెని శోభన్ బాబు, , పిన్నేని సందీప్, బిట్టు వీరయ్య, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, కొనకంచి శ్రీను, తొగరు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### అంబరాన్నంటుతున్న సంక్రాంతి సంబరాలు

# ముస్తాబైన పల్లెలు




**చందూరు జనవరి 13 (జనంసాక్షి)**
చందూరు మండల వ్యాప్తంగా సంక్రాంతి పండగ వాతావరణం సంతరించుకుంది. తెలుగు వారి పెద్ద పండగగా పిలువబడే సంక్రాంతిని స్వాగతించేందుకు మండలంలోని పల్లెలన్నీ ముస్తాబయ్యాయి. ధనుర్మాసం చివరి రోజులు కావడంతో పాటు, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

**కళకళలాడుతున్న పల్లెలు:**
మండలంలోని చందూరు మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాలైన పుల్లెప్మ, కస్తాల, బంగారిగడ్డ, నెర్మట తదితర గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఆడపడుచులు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అలంకరిస్తున్నారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో గ్రామీణ వాతావరణం ఒక్కసారిగా కోలాహలంగా మారింది.

**భోగి మంటలకు సిద్ధం:**
నేడు రాబోయే భోగి పండుగ కోసం యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాత వస్తువులను దహనం చేసి, కొత్త ఆశయాలతో ముందుకు సాగాలనే సంకేతంతో భోగి మంటలు వేయడానికి కట్టెలు, పిడకలను సిద్ధం చేస్తున్నారు.

**కిటకిటలాడుతున్న చండూరు మార్కెట్:**
పండగ వేళ కొత్త బట్టలు, పూజా సామగ్రి, పిండివంటల సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రజలు చందూరు సంతకు, కిరాణా షాపులకు తరలిరావడంతో బజారు కిటకిటలాడుతోంది. ముఖ్యంగా బట్టల షాపులు, స్వీట్ షాపుల వద్ద రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది.

**రైతుల ఆనందం**
ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రావడంతో రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తోంది. కొత్త ధాన్యం ఇంటికి చేరడంతో లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతూ రైతులు సంక్రాంతి లక్ష్మిని పూజించేందుకు సిద్ధమయ్యారు.

**పండగ విశేషాలు**

**ముగ్గుల పోటీలు:**
పలు గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.

**పతంగుల సందడి:**
పిల్లలు, యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ ఆకాశాన్ని రంగులమయం చేస్తున్నారు.

**కుటుంబాల కలయిక:**
ఉద్యోగ, వ్యాపార రీత్యా హైదరాబాద్, ఇతర నగరాల్లో స్థిరపడిన వారు పండగ కోసం సొంతూళ్లకు చేరుకోవడంతో ఇళ్లన్నీ బంధుమిత్రులతో నిండిపోయాయి.
సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, పాడిపంటలతో మండలం సుభిక్షంగా ఉండాలని పలువురు ప్రజా ప్రతినిధులు, పెద్దలు ఆకాంక్షించారు.

## మేళ్లచెరువులో టార్చ్ ర్యాలీ

**మేళ్లచెరువు( జనంసాక్షి)**
ఈనెల 17వ తేదీ నుండి చీఫ్ మినిస్టర్ కప్ టోర్నమెంట్ క్రీడా పోటీలు మండల కేంద్రమైన మేళ్లచెరువులో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఈ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరుతూ మేళ్ల చెరువులో గ్రామపంచాయతీ కార్యాలయం నుండి,మెయిన్ రోడ్డు వరకు ప్రభుత్వ అధికారులు, విద్యార్థిని విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు కలిసి టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజేందర్ రెడ్డి,ఎంపీడీవో అస్కర్ అలీ,ఎస్ఐ పరమేష్, ఎంఈఓ వెంకటరెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం కప్ 2026 అవగాహన ర్యాలీ

**హుజూర్ నగర్ రూరల్, జనవరి 13(జనంసాక్షి):**
స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి తాహసిల్దార్ కార్యాలయం వరకు సీఎం కప్ ఆటలకు సంబంధించి మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. సీఎం కప్ 2026 ర్యాలీని ఎంపీడీవో దేవిరెడ్డి సుమంత్ రెడ్డి ,ఎస్సై బండి మోహన్ బాబు, ఎంపీఓ లావణ్య, సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి క్రీడా జెండాను ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత లోని క్రీడా ప్రతిభను వెలికితీయడం కొరకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిందని




పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పీఈట ీలు, ఉపాధి హామీ, కార్యాలయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా భోగి వేడుకలు

**సూర్యాపేట(జనంసాక్షి) :**
సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు దారోజు భాగ్యరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సంక్రాంతి పండగను పురస్కరించుకొని భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగి వేడుకలను ప్రారంభించారు. అనంతరం భోగిమంటల చుట్టూ తిరుగుతూ వార్డు ప్రజలు, మహిళలు, చిన్నారులు,యువత సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చెడు ఆలోచనలు, పీడలన్నీ భోగిమంటల్లో కలిసిపోవాలని




అన్నారు. అందరికీ అన్ని శుభాలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ షేక్ గౌస్, ఎర్ర పృథ్వి రెడ్డి, కమతం శ్రీకాంత్, కమతం ప్రశాంత్, బన్నీ, పురుషోత్తం, సరిత, నవ్య, శ్రీలత,ఉమా, జ్యోతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### రానున్న మున్సిపల్ ఎన్నికలకు

# సిద్ధంగా ఉండాలి

**రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**దేవరకొండ, జనవరి 13(జనంసాక్షి):**
రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన దేవరకొండ ఆర్డిఓ కార్యాలయంలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్, ఇతర రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో రెవెన్యూ, మున్సిపల్ అంశాల పై సమీక్షించారు. ముందుగా రెవెన్యూ అంశాలపై మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న భూముల,రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ డి ఓ తో కోరారు. ప్రజా వాణి,భూభారతి సమస్యలపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ తో మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని,ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా, ఎన్నికల సక్రమ నిర్వహణకు వివిధ బృందాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు,డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్ల వివరాలు, తదితర అన్ని అంశాలపై సూచనలు చేశారు.ఆర్ డి ఓ రమణారెడ్డి ,మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, తదితరులు ఉన్నారు.

## పున్న కైలాస్ నేతకు తక్షణమే రక్షణ కల్పించాలి

**కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా ఉపాధ్యక్షులు కురుపాటి గణేష్ డిమాండ్**



**చండూరు జనవరి 13 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు(డి.సి.సి.ప్రెసిడెంట్)పున్న కైలాస్ నేత ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, ఆయనకు తక్షణమే 'వన్ ప్లస్ వన్' (1+1) గన్మెన్లను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా ఉపాధ్యక్షులు కురుపాటి గణేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు..మంగళవారం నాడు నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కురుపాటి గణేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పున్న కైలాస్ నేత నిరంతరం శ్రమిస్తున్నారని, ఈ క్రమంలో ఆయనకు భద్రతా పరమైన ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని, కైలాస్ నేత పర్యటనలు మరియు ఆయన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే గన్మెన్లను మంజూరు చేయాలని కోరారు. క్షేత్రస్థాయి లో ప్రజల కోసం పోరాడే నాయకు లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని, ఎలాంటి అవాంఛ నీయ సంఘట నలు జరగకముందే హోంశాఖ అ ప్రమత్తం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని పున్న కైలాస్ నేతకు భద్రత కల్పించాలనే మద్దతు తెలిపారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ అందచేత

**చింతలపాలెం(జనంసాక్షి)**

సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి ఒక లక్ష నూట పదహారు వేల రూపాయల చెక్కును దొండపాడు గ్రామానికి చెందిన నూతలపాటి వీరమ్మకు తహసీల్దార్ సోమపంగు సూరయ్య,దొండపాడు గ్రామ ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అందచేయడం జరిగింది.

## వైన్స్ లలో 75,000 నగదు మూడు ఫుల్ బాటిల్స్ చోరీ



**నేరేడుచర్ల జనవరి 12 (జనంసాక్షి) :**

నేరేడుచర్ల పట్టణంలో గల జాన్ పహాడ్ రోడ్డు నందు పక్కపక్కనే నిర్వహిస్తున్న శివాంజనేయ, విజయదుర్గ వైన్స్ లలో సోమవారం రాత్రి దొంగలు పడ్డారని నేరేడుచర్ల ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం రెండు వైన్స్ లలో కలిపి డెబ్బై ఐదు వేల రూపాయల నగదు మూడు ఫుల్ బాటిల్స్ ఒక బీరు బాటిల్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు వెళ్లినట్లు వెళ్లినట్లు తెలిపారు.చోరీకి పాల్పడిన విజువల్స్ సీసీ కెమెరాలో ప్రత్యక్షమయ్యాయి.అవి పరిశీలిస్తున్నారు.ఆయా వైన్స్ యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

### సీఐ వెంకటేశ్వర్లు

**రామన్నపేట, జనవరి 13 (జనంసాక్షి):**

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సిఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో వాహరదారులకు ప్రజలకు రోడ్డు భద్రత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. వాహరదారులు రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండ హెల్మెంట్ దరించి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి , ఇన్సురెన్స్ తప్పకుండ ఉండాలని అన్నారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం త్రాగి వాహనాలను నడపకుడదని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం వలన ఎంతో మంది వికలాంగులుగా మారి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, వార్డు మెంబెర్, డాన్ బాస్కో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానీ, పోలిసు స్టేషన్ సిబ్బంది ఏఎస్ఐ సురేందర్, కమలాకర్, మల్లికార్జున్, సత్యనారాయణ, స్వామి, నరసింహా, ప్రవీణ్, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసేవకే జీవితం అంకితం చేసిన మహనీయులు ఉప్పల మల్సూరు

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**



ప్రజా ప్రతినిధిగా ప్రజల సేవలో తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే ఉప్పల మాల్సూరు అని సూర్యాపేట పూర్వ విద్యార్థుల మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పూర రామ్మూర్తి యాదవ్, అధ్యక్షులు నల్లకుంట్ల అయోధ్య అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఉప్పల మాల్సూరు 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సూర్యాపేట నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజల ఆశీర్వాదంతో గెలిచి ప్రజలకు సేవ చేయడమే కర్తవ్యంగా పని చేశారని తెలిపారు.జిల్లా కేంద్రంలోని నల్లాల బావి వద్ద ఉప్పల మల్సూర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచి కనీసం ఇల్లు లేని జీవితం సాగించి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశారని కొనియాడారు.ఉప్పల మల్సూరు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు.బీఎన్ రెడ్డి, ధర్మబిక్షం, మల్లు స్వరాజ్యం,ఉప్పల మల్సూర్, నర్రా రాఘవరెడ్డి వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్య మల్లికార్జున్, డేగల జనార్ధన్, నాతి సవేందర్, జిలకర చంద్రమౌళి, విద్యాసాగర్, సారగండ్ల మాణిక్యమ్మ, చిత్రం భద్రమ్మ,వీర్లపాటి వెంకన్న, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ హాస్పిటల్లో ఉద్యోగులు ప్రసవించడం ద్వారా ప్రజలకు నమ్మకం కలుగుతుంది..

### కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**నేరేడుచర్ల (జనంసాక్షి)**

ప్రభుత్వ హాస్పిటల్లో ఉద్యోగులు ప్రసవించడం ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్ పై ప్రజలకు నమ్మకం కల్గుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.నేరేడుచర్ల ప్రభుత్వం ఆస్పత్రి లో ఆయుర్వేద డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శృతి మంగళవారం ఉదయం నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది.ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మంగళవారం రాత్రి పి హెచ్ సి లో ఉన్న శృతి ని అభినందించి బేబీ కిట్ ను అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శ్రీనివాసులు, డిఎంహెచ్ఓ వెంకటరమణ,డాక్టర్ నాగిని, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నిరంతర కృషితో డాక్టరేట్ సాధించిన చల్ల రామయ్య



**తుంగతుర్తి, జనవరి 13 (జనంసాక్షి)**

తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామానికి కి చెందిన చల్ల సుగుణమ్మ రాములు దంపతులకు నాలుగవ సంతానం చల్ల రామయ్య (అలియాస్ రాము)కు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈవీసీ శేఖర రావు, ఓయూ ప్రొఫెసర్ పీ.సతీష్ కుమార్ పర్యవేక్షణలో "ఏ నోవెల్ కంట్రోల్ ఫర్ హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ సోర్స్ అండ్ గ్రిడ్ కనెక్టెడ్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్ యూజింగ్ పార్షల్ పవర్ చార్జింగ్ సర్క్యూట్ టోపాలజీ" అనే అంశంపై పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా చల్ల రామయ్య మాట్లాడుతూ కడు పేదరికంలో పుట్టినా, చిన్న నాటి నుండి చదువు అంటే ఇష్టంతో కష్టపడి ఇంజనీరింగ్ విద్యలో డాక్టరేట్ సాధించిన ఘనత రామయ్యదే. నిరంతర కృషితో ప్రాథమిక విద్యాభ్యాసం యు పి పి ఎస్ బండరామారం, ఉన్నత విద్యను జెడ్పిహెచ్ఎస్ తుంగతుర్తి, ఇంటర్మీడియట్ తుంగతుర్తి లోని డిజిఆర్ఎం కలశాల లో పూర్తి చేశాడు. 2008 లో ఎంసెట్ లో ఉత్తీర్ణత సాధించి అన్నయ్యల ఆర్థిక సహాయంతో పాటు, ట్యూషన్స్ చెప్పుకుంటు 2012 లో బిటెక్ పూర్తి చేశాడు. గేట్ ప్రవేశా పరీక్ష లో ఉత్తీర్ణత సాధించి 2014 లో ఎంటెక్ లో గోల్డ్ మెడల్ సాధించాడు. హైదరాబాద్ లో పలు ఇంజనీయింగ్ కలశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా చేస్తు 2108 లో పి హెచ్ డి కోర్సు లో చేరాడు. 2023 లో విద్యుత్ శాఖలో వచ్చిన ఉద్యోగ భాధ్యతలను నిర్వహిస్తూ చదువును ఆపేయకుండా పి. హెచ్ డి ని పూర్తి చేశాడు. ఈ సందర్భంగా చల్ల రామయ్య మాట్లాడుతూ ప్రొఫెసర్లకు, తన చదువుకు సపోర్టు చేసినా భాగస్వామి స్వప్న, కుటుంబ సభ్యులు అన్నయ్యలు శ్రీధర్, నగేష్, తమ్ముడు లక్ష్మణ్, అక్క సరిత, వదినలు మాదవి, సునీత లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. తను సాధించిన డాక్టరేట్ ను తల్లి దండ్రులకు, గ్రామస్తులకు అంకితం చేసుతున్నాను అని వారు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం సత్యనారాయణ ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు. బండ రామారం ప్రజలు, బంధు మిత్రులు, పలువురు ఆయనను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

### ఉదారతను చాటుకున్న మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోడలా అల్వాల్ రెడ్డి

**మర్రిగూడ, జనవరి 13(జనం సాక్షి)**

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత. మర్రిగూడ మండలం లోని వట్టిపల్లి గ్రామం లో ఎర్ర సురేష్(30) అనే వ్యక్తి మంగళవారం అనారోగ్యంతో మరణించడం జరిగింది. మొదటి నుండే విరిది భీధ కుటుంబం కావడంతో అతని మృతి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. మర్రిగూడ మండల అధ్యక్షులు కోడలా అల్వాల్ రెడ్డి10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించి ఉదారతను చాటుకున్నారు. ఆపద సమయంలో ఆపద్బాంధవుడు లాగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలబడుతున్న కోడలా అల్వాల్ రెడ్డిని సేవలను వట్టిపల్లి గ్రామ ప్రజలు కొనియాడారు.





## జాతీయ స్థాయి క్రీడల్లో సోమారం అమ్మాయి 'కావ్య'కు బంగారు పతకం

**నేరేడుచర్ల (జనంసాక్షి ):**

మండలంలో సోమవరం గ్రామానికి చెందిన వాదపల్లి కావ్య జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఇటీవల వరంగల్ లో జరిగిన 69వ ఎస్ఏఫ్ఐ అండర్-19 జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో -70 కేజీల విభాగంలో కావ్య స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. గ్రామానికి చెందిన వాదపల్లి జానయ్య కుమార్తె అయిన కావ్య, చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల మక్కువతో కఠినంగా శ్రమించి ఈ ఘనత సాధించింది. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం పట్ల గ్రామస్తులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. కావ్య సాధించిన ఈ విజయం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. తన కుమార్తె జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తండ్రి జానయ్య ఆనందం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రంగవల్లులు





మణుగూరు, జనవరి 13(జనం సాక్షి):
తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం ఉంటుందని పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళ వారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యులు వైద్య సిబ్బంది అందమైన ముగ్గులు వేశారు. ఈ ముగ్గులను పాయం వెంకటేశ్వర్లు సర్పంచులు మెంబర్లు, ఆసుపత్రి సూపరింటెంట్ సునీల్ ఆర్ఎం గౌరీ ప్రసాద్ ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆసుపత్రిలో రోగులతో బిజీ గా ఉన్న వైద్యులు అవన్నీ పక్కన పెట్టి పండుగ వాతావరణం తీసుకొచ్చారు. తీరొక్క ముగ్గులతో బొబ్బెమ్మలను పెట్టి డుడు బసవన్నల బోగీ మంటలతో చెరుకు గడలతో అందమైన రంగవల్లులను మహిళలు ఎంతో చక్కగా వేశారు ఆ ముగ్గులను చూసి పండుగ అప్పుడే వచ్చిందా అనిపించింది. వైద్యులకు వైద్య సిబ్బందికి ఇతర విభాగాల మహిళలకు ముందుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అంటే అందరికీ ఒక రకమైన భయం ఏర్పడేది. అలాంటి పరిస్థితి నుంచి నేడు అన్ని సౌకర్యాలు తో అందరికీ మెరుగైన వైద్యాన్ని అందిస్తోంది. నెలకు 20 నుంచి 30 కాన్పుల చేసిన ఆసుపత్రిలో ఇవాళ నెలకు 100 ప్రసవాలు చేసి రికార్డు సృష్టించాయి. అన్ని విభాగాలలో వైద్యులను నియమించి పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. తద్వారా పదుల సంఖ్యలో ఉన్న ఓపి లు రోజుకు సుమారు 500 ఓపీ లతో పెంచి పేదలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తోంది.. ప్రవేట్ ఆసుపత్రిలో వేలల్లో ఖర్చు పెట్టుకొనే స్తోమత లేని వారికి ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని జబ్బులకు వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి లో సౌకర్యాల కల్పించటంలో ముందుంటా నని ఏ అవసరాలున్న నేరుగా కలువ వొచ్చని అన్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రతి పేదవాడికి ప్రభుత్వ వైద్యం అందించాలని ప్రభుత్వం ధ్యేయం అన్నారు.. అనంతరం విజేతలకు బహు మతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ సునీల్ ఆర్ఎం గౌరీ ప్రసాద్, కంటి వైద్యులు సంజీవరావు, , సమితి సింగారం సర్పంచ్ కె మాధవరావు, ఉప సర్పంచ్ జి సురేష్, లంక మల్లారం సర్పంచ్ పూనేం రమేష్, కూనవరం ఉప సర్పంచ్ బంటు,మహిళలు వైద్యులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**చిన్నారులకు పతంగులు పంపిణీ చేసిన ధార యుగంధర్**

## దమ్మపేటలో మొదలైన సంక్రాంతి సందడి

**దమ్మపేట,జనవరి13(జనంసాక్షి):**
దమ్మపేట మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని,ఆర్యవైశ్య సంఘం సహకారంతో ధర యుగంధర్ ఆధ్వర్యంలో చిన్నారులకు భారీ స్థాయిలో పతంగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పండుగ అంటే కేవలం పెద్దలకే కాకుండా,చిన్నారులకు ఒక తీపి జ్ఞాపకంగా మిగలాలని భావించిన దారా యుగంధర్, స్వయంగా ముందుండి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని పలువురు చిన్నారులకు రంగురంగుల పతంగులను పంపిణీ చేస్తూ,వారితో కలిసి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మన సంప్రదాయ పండుగలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందనీ. సంక్రాంతి వేళ పిల్లలు ఆకాశంలో పతంగులు ఎగురవేస్తూ పొందే ఆనందం వెలకట్టలేనిది అని,ఆ చిన్నారుల ముఖాల్లో ఆనందం చూడటమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న దారా యుగంధర్ పై స్థానికులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రశంసలు కురిపించారు. పండుగ పూట తమ పిల్లలకు పతంగులు పంపిణీ చేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాది,వార్డ్ మెంబర్ భవాని కృష్ణ యాదవ్,రూప రాంబాబు,ఆర్యవైశ్య సంఘం సభ్యులు అడపా సాయి,గ్రామస్తులు మారం శ్రీను తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేరు వంచలో అట్టహాసంగా ముగ్గుల పోటీలు

## సృజనాత్మకతకు అద్దం పట్టిన రంగవల్లులు











**కల్లూరు జనవరి 13 (జనంసాక్షి):**
సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆశీస్సులతో కల్లూరు మండల పరిధి పేరువంచ గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు కనులవిందుగా సాగాయి. గ్రామ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ముగ్గులపోటీలకు మహిళలు విద్యార్థులు యువతులు తరలివచ్చి రంగురంగుల రంగవల్లులతో పాఠశాల ప్రాంగణమంతా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మహిళలు కేవలం ముగ్గులు వేయడమే కాకుండా, వాటిలో సామాజిక అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను చొప్పించి తమ సృజనాత్మకతను చాటారు. రైతన్నకు భరోసా, మహిళా రక్షణ వంటి అంశాలను ప్రతిబింబించేలా వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగవల్లుల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు సర్పంచ్ కిసర నిర్మల మోహన్ రెడ్డి , ఏఎంసీ చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కీసర మోహన్ రెడ్డి చేతుల మీదుగా నగదుబహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి మరకాల శిరీష రూ. 5,116 ద్వితీయ బహుమతి మరకాల కల్పన. రూ 3,116 తృతీయ బహుమతి చిన్నంశెట్టి సౌమ్య రూ. 2116 అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి కల్లూరి ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మన సంస్కృ తికి అద్దం పడుతున్నాయిఅని తెలిపారు. తెలుగు ప్రజల సంస్కృతి సాంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన పెద్ద పండుగ సంకురాత్రి అని పేర్కొన్నారు. పల్లెల్లో సంక్రాంతి శోభ నెలకొందన్నారు. భోగి, మకర సంకురాత్రి, కనుమ, ముక్కనుమ నాలుగు రోజుల సంకురాత్రి సంబరాలు ఆనందోత్సవాలతో ప్రజలంతా జరుపుకోవాలని , భోగభాగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజలంతా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశారు. రంగవల్లుల పోటీల్లో విజేతలైన వారికిఫస్ట్ ప్రైజ్ కాంట్రిబ్యూషన్ కీసర నిర్మల మోహన్ రెడ్డి సెకండ్ ప్రైజ్ కాంట్రిబ్యూషన్ పరిమి కృష్ణవేణి భరత్ అండ్ మెంతుల యతీష్.తృతీయ బహుమతి కాంట్రిబ్యూషన్ మరకాల మాధవరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కీసర నిర్మల, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎండి మౌలాలి,కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రభాకర్ చౌదరి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కీసర మోహన్ రెడ్డి భాగం ప్రభాకర్ చౌదరి, జోనబోయిన గోపాలరావు , పంచాయతీ ఉప సర్పంచ్ పరిమి కృష్ణవేణి భరత్, పాలకవర్గం సభ్యులు కొండపల్లి మురళి, జె పుష్పలత, కోట బన్నీ, కొనకళ్ళ తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వీయ క్రమశిక్షణ ఉంటే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చు

## ఎస్ ఐ మేడా ప్రసాద్





బూర్గంపహాడ్ జనవరి 13 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, ప్రతిఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ ఐ మేడా ప్రసాద్ అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎస్ పి రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు హెల్మెట్ వినియోగం, సీట్ బెల్టు ప్రాధాన్యత, గోల్డెన్ అవర్, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడంలో స్వీయక్రమశిక్షణ కలిగి ఉంటే ప్రమాదాలను చాలావరకు నియంత్రించవచ్చని, వీధుల్లో వాహనాలు నడిపే సమయంలో పోలీసులు ఉన్నా లేకపోయినా నియమ, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు పాటించి తమ ప్రాణ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు కూడా సహకరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్లోడ్, ఓవర్స్పీడ్ వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరిస్తూ తమతో పాటు కుటుంబాన్ని గుర్తుంచుకుని వాహన డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో అదనపు ఎస్ ఐ దేవ్ సింగ్, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, గ్రామస్థులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# సులానగర్ గ్రామంలో సంక్రాంతి రంగుల పండుగ

### గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



**టేకులపల్లి,జనవరి 13(జనంసాక్షి):**
టేకులపల్లి మండలంలోని సులానగర్ లో ఘనంగా మకర సంక్రాంతి రంగుల పండుగతో ముగ్గుల పోటీలు సులానగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోతు లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు,యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు గొబ్బెమ్మలతో సంక్రాంతి పండుగకు ఒక రోజు ముందే సులానగర్లో పండుగ వాతావరణం కోలాహలంగా మారింది. యువతులు ఈ సందడిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా టేకులపల్లి సర్పంచ్ దంపతులు బోడ బాలు నాయక్,జ్యోతి ఉపసర్పంచ్ అనంతుల వసంత,బిఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు రేణుక పాల్గొనగా, న్యాయ నిర్ణీతలుగా మండల ఏవో ఎన్ అన్నపూర్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పవిత్ర ,అంగన్వాడి టీచర్ పద్మ పాల్గొన్నారు. మొదటి బహుమతిగా 1000/ రూపాయలు రెండో బహుమతి 500/ మూడో బహుమతి 250/ రూపాయలుగా నిర్ణయించి విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా నగదును అందజేశారు. సులానగర్ కార్పెంటర్ దాసోజు భాస్కరాచారి ముగ్గుల పోటీలో పాల్గొన్న అందరికీ గిఫ్ట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సులనగర్ సర్పంచ్ లక్ష్మనాయక్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలతో సులానగర్ కూ సంక్రాంతి పండగా ముందుగానే వచ్చిందని, గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను మమేకం చేస్తూ పండుగ సంబరాన్ని ఉత్సాహంగా జరుపుకుంటామని గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని గ్రామ ప్రజలందరికీ సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సులానగర్ ఉప సర్పంచ్ ఉండేటి చెన్నయ్య,టేకులపల్లి సర్పంచ్ బోడా బాలు నాయక్, ఏవోఉపసర్పంచ్ అనంతుల వసంత , ఎన్. అన్నపూర్ణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షురాలు ఆమెడ రేణుక,వార్డు మెంబర్, కార్యక్రమ నిర్వాహకుడు బానోతు సరిలాల్, అంగన్వాడి టీచర్ పద్మ ,గుండా రవీందర్ రెడ్డి , బానోతు లక్పతి,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.